రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్
జలమయం
- చెరువులా మారిన ప్రాంగణం
- బస్సుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- ప్రయాణికుల అవస్థలు



అమలాపురం రూరల్ మండలం నల్లమిల్లిలో నీటమునిగిన పంట పొలాలు



ముమ్మిడివరం మండలం చింతలమెరకకు వెళ్లే రోడ్డు..

జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండడంతో పల్లపు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం 10 గంటల వరకు కురిసిన భారీ వర్షాలతో పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న లోతట్టు ప్రాంతాలన్నీ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు నీట మునిగాయి. ముందు జాగ్రత్తగా బుధవారం ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సెలవు ప్రకటించారు.



పి.గన్నవరం: కొత్త, పాత అక్విడెక్టుల మధ్య గోదావరి ప్రవాహం


- భారీ వర్షాలతో పల్లపు ప్రాంతాలు జలమయం
- ముంచుకొస్తున్న గోదావరి వరద
- జలదిగ్బంధంలో ప్రభుత్వ కార్యాలయాలు
- జిల్లాలో పరిస్థితిపై కలెక్టర్ మహేష్‌కుమార్ సమీక్ష
- కుంగుతున్న గట్లను పరిశీలించిన అధికారులు



మునిగిన రావులపాలెం బస్టాండ్

రావులపాలెం, సెప్టెంబరు 4: రావులపాలెం మండలంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేని వర్షం కురిసింది. దీంతో రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ పూర్తిగా నీటమునిగింది. బస్సులు కాంప్లెక్స్‌లోకి వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. ప్రయాణికులు జాతీయ రహదారి పైనే గమ్యస్థానాలకు చేరేందుకు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతు బజార్ ప్రాంతం పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకోవడంతో రైతు బజార్‌కు వచ్చేవారు, ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పంట పొలాల్లోకి భారీగా ముంపునీరు వచ్చి చేరుతోంది. మురుగు డ్రైయిన్లు సైతం పొంగి ప్రవహిస్తుండటంతో పంట పొలాలు ముంపు బారిన పడ్డాయి. రహదారి గోతులలోకి వర్షపునీరు భారీగా చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

వరద భయం



అధికారులు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

వర్షాల వల్ల ఉత్పన్నమయ్యే పరిస్థితులను కలెక్టర్ మహేష్‌కుమార్ వీడియో కాన్ఫరెన్సు ద్వారా జిల్లా యంత్రాంగంతో సమీక్షించారు. ముఖ్యంగా విద్యుత్ సమస్యలు సత్వర పరిష్కారానికి ఏపీడీసీఎల్ సిబ్బంది చర్యలు చేపట్టాల్సిందిగా కలెక్టర్ ఆదేశాలిచ్చారు. భారీ వర్షాలకు ముమ్మిడివరం, రాజోలులోని ప్రభుత్వ కార్యాలయాలు జలదిగ్బంధానికి గురయ్యాయి. కోనసీమ ముఖ ద్వారమైన రావులపాలెం ఆర్టీసీ బస్ కాంప్లెక్సు జలదిగ్బంధంలో చిక్కుకుంది.

(అమలాపురం-ఆంధ్రజ్యోతి):

అమలాపురం పట్టణంతో సహా వివిధ ప్రాంతాల్లోని రహదారులు, గ్రామీణ రహదారులపై నీరు నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. జిల్లా వ్యాప్తంగా 46.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కొత్తపేట మండలంలో 109.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా మలికిపురంలో 10.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాగల రెండు, మూడు రోజుల్లో జిల్లాలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నట్టు వాతావరణశాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేయడంతో యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధం కావాలని కలెక్టర్ సూచించారు. భారీ వర్షాల వల్ల జిల్లాలోని ప్రధానమైన మేజర్, మైనర్ డ్రెయిన్లు పొంగి ప్రవహించడంతో సమీపంలో ఉన్న పంట పొలాలన్నీ జలదిగ్బంధానికి గురై అన్నదాతలకు మరోసారి ఇబ్బందులు తలెత్తాయి. జిల్లా వ్యాప్తంగా కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ టి.నిషాంతి, ఆర్డీవోలు, ఇతర జిల్లాస్థాయి అధికారులు వర్షాల వల్ల ముంపునకు గురైన, వరదల ప్రభావానికి లోనవుతున్న గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి పరిస్థితిని సమీక్షించారు.





ముమ్మిడివరంలో..



ధవళేశ్వరం బ్యారేజీ వద్ద వరద ఉధృతి

గోదావరికి పెరుగుతున్న వరద

గోదావరికి వరదలు మళ్లీ పోటెత్తుతున్నాయి. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతుండడంతో మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. రాగల 48 గంటల్లో వరదల ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున నదీ పరివాహక లంక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తతో ఉండాలని అధికారులు హెచ్చరించారు. బుధవారం కలెక్టర్ మహేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ నిషాంతి, పలువురు ఆర్డీవోలు ఆయా మండలాల్లోని వరద ప్రభావిత ఏటిగట్లను గ్రామాల్లోని పరిస్థితులను ప్రత్యక్షంగా వీక్షించి సమీక్షించారు. కలెక్టర్ గోపాయిలంక స్లూయిస్‌ను, సముద్ర తీరంలో ఉన్న ఫిషర్‌మెన్ జెట్టీని పరిశీలించారు. వృద్ధ గౌతమీ నదీపాయను ఆనుకుని ఉన్న కుండలేశ్వరం నుంచి పల్లంకుర్రు వెళ్లే ఏటిగట్టు రహదారి మార్గం ఓ వైపు భారీగా కుంగిపోతున్న ప్రాంతాన్ని మండలస్థాయి అధికారుల బృందం పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించింది. వరదలు పెరుగుతున్న దృష్ట్యా ఫెర్రీ పాయింట్ల వద్ద ప్రయాణికులకు లైఫ్ జాకెట్లు, గజఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని, అధికారుల సూచనలకు అనుగుణంగానే పడవల రాకపోకలు నిర్వహించాలని కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సులో అధికారులకు సూచించారు. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల వల్ల ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేసే అవకాశం ఉన్నందున అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బలహీనంగా ఉన్న ఏటిగట్లు, స్లూయిస్‌లు, అక్విడెక్టులు, కల్వర్టులను గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకునేలా చూడాలన్నారు. అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సహాయక, రక్షణ చర్యల్లో లోటుపాట్లు రాకుండా చూసుకోవాలని సూచించారు.

'ధవళేశ్వరం' వద్ద ఇదీ పరిస్థితి..

ధవళేశ్వరం, సెప్టెంబరు4: తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ నుంచి వచ్చి చేరుతున్న వరద ప్రవాహం అంతకంతకు పెరుగుతూ సముద్రంలోకి పరుగులు తీస్తోంది. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం బుధవారం రాత్రి 8 గంటలకు 9.60 అడుగులకు చేరుకుంది. ఈ సమయంలో కాటన్ బ్యారేజీ నుంచి 7,14,614 క్యూసెక్కుల వరద సముద్రంలోకి ప్రవహిస్తోంది. ధవళేశ్వరం వద్ద నీటిమట్టం గురువారం నాటికి మరో అడుగున్నర వరకు పెరిగి 11 అడుగులకు చేరవచ్చని, సుమారు 9 లక్షల క్యూసెక్కుల వరద తరలిరావచ్చని అధికారుల అంచనా. ఎగువన భద్రాచలం వద్ద బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు నీటిమట్టం మొదటి ప్రమాద హెచ్చరిక 43 అడుగులు దాటి ప్రవహించగా, సాయంత్రానికి మరింత పెరిగి 44.40 అడుగులకు చేరుకుంది. ఎగువ నుంచి వస్తున్న వరద ఉధృతి తగ్గుముఖం పడుతుండడంతో భద్రాచలం వద్ద పెరుగుదల వేగం నెమ్మదించింది. ఎగువన కాళేశ్వరం వద్ద బుధవారం సాయంత్రానికి నీటిమట్టం 11.31 మీటర్లకు చేరుకోగా, పేరూరు వద్ద 15.39 మీటర్లు, దుమ్ముగూడెం వద్ద 12.08 మీటర్లు, భద్రాచలం వద్ద 44.40 అడుగులు, కూనవరం వద్ద 17.05 మీటర్లు, కుంట వద్ద 8.25 మీటర్లు, పోలవరం వద్ద 11.37 మీటర్లు, రాజమండ్రి రైల్వే బ్రిడ్జి వద్ద 15.17 మీటర్లుగా నీటిమట్టం నమోదైంది.

ఫిష్ లాండింగ్ కేంద్రంలో
సౌకర్యాలు కల్పించాలి
కలెక్టర్ మహేష్‌కుమార్



అవుట్‌ఫాల్ స్లూయిస్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అల్లవరం, సెప్టెంబరు 4: అల్లవరం మండలం ఓడలరేవు జెట్టి ఓడరేవు ఫిష్ లాండింగ్ కేంద్రంలో పూర్తి సౌకర్యాలు కల్పించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలను ఎదుర్కొనే సన్నద్ధతను పరిశీలించేందుకు బుధవారం ఆయన అల్లవరం మండలంలో పర్యటించారు. ఓడలరేవు ఫిష్ లాండింగ్ కేంద్రాన్ని సందర్శించి వేలం పాట గది, వలలు అల్లుకునే గదులను ఎప్పుడు నిర్మిస్తారనే అంశంపై ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ అయిన హెడ్‌వర్క్స్ అధికారులను ఆరా తీశారు. ఫిష్ లాండింగ్ నిర్మాణం జెట్టి నిర్మాణం పూర్తయిందని మిగిలిన పనులను త్వరలోనే పూర్తిచేస్తామని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. త్వరలో మిగిలిన సౌకర్యాలను కల్పించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం కలెక్టర్ వరద సమయంలో ముంపు సమస్యకు కారణం అవుతున్న గోడితిప్ప శివారు గోపాయిలంక కుమ్మరికాలువ డ్రైయిన్‌పై ఉన్న అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ను పరిశీలించారు. అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లో ఉన్న 8 షటర్లకు మరమ్మత్తులు చేయాల్సి ఉందని, ఒక షటర్ పూర్తిగా దెబ్బతిందని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. పాడైన షట్టర్ స్థానంలో కొత్త షటరు ఏర్పాటు చేసి రైతులకు సమీప గ్రామాలకు ముంపు సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అవుట్‌ఫాల్ స్లూయిజ్ కొత్త తలుపులు ఏర్పరచడానికి రూ.80 లక్షలతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదించామని కలెక్టర్‌కు తెలిపారు. గోదావరి నదికి వరద వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లను అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. డ్రైన్లు గోదావరి నదీలో కలిసే ప్రాంతాల వద్ద చెత్తా చెదారాల వల్ల నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడి పంటపొలాలు ముంపునకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దారు ఎస్‌వీఎస్ నరసింహరావు, ఎంపీడీవో కృష్ణమోహన్, సర్పంచ్‌లు మల్లాడి మంగాయమ్మ, చిట్నీడి శ్రీదేవి, రొక్కాల విజయలక్ష్మీతో పాటు మల్లాడి ఉమామహేశ్వరరావు, చిట్నీడి శ్రీనివాస్, ఇరిగేషన్, డ్రైనేజీ, హెడ్‌వర్క్స్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

సవరించిన అంచనా వ్యయం
రూ.1.45 కోట్లు మంజూరు

అమలాపురం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణం సమీపంలో నల్లవంతెన నుంచి నడిపూడి వెళ్లే ప్రాంతంలో వంతెనకు సవరించిన అంచనా వ్యయం ప్రకారం రూ.1.45 కోట్లు మంజూరు చేస్తూ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కిలోమీటరు 70 వద్ద డ్రెయిన్‌పై హెచ్‌ఎల్‌బీ నిర్మాణం కోసం ఈ నిధులు మంజూరైనట్టు ప్రభుత్వం తెలిపింది.









ప్రభుత్వం డిజిటల్ సేవలు నిమిత్తం అందించిన పరికరాలు

రైతుల ముంగిటకు ఆన్‌లైన్ సేవలు



ప్రస్తుతం ప్రతి అంశం సాంకేతికతతో ముడిపడి ఉండటంతో రైతులకు కూడా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. గ్రామీణ ప్రాంతాలలో రైతులకు సేవలందించే ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పీఏసీఎస్)లను సాంకేతికరమైన అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు చర్యలు మొదలయ్యాయి. ఇప్పటికే ప్రతి పీఏసీఎస్‌లోను సీఎస్‌సీ ద్వారా 354 రకాల సేవలందించే దిశగా కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. అయితే ఇతర బ్యాంకుల్లో ఆన్‌లైన్ ద్వారా అందించే సేవలు మాదిరిగా పీఏసీఎస్‌ల్లో అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను తయారు చేసింది. ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా ఇక సొసైటీల్లోను అన్నదాతలకు ఆన్‌లైన్ సేవలు అందనున్నాయి.

● (పి.గన్నవరం)

దేశంలో ఎక్కడ నుంచి అయిన రైతు బ్యాంకింగ్ సేవలు పొందవచ్చు. సొసైటీల్లో జరుగుతున్న అవకతవకలకు చెక్ పెట్టేందుకే కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రతి రైతుకు పారదర్శకంగా సేవలందించాలనే లక్ష్యంతో పీఏసీఎస్‌ల కంప్యూటరీరణ చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నాబార్డు, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు నాబార్డులు దేశ వ్యాప్తంగా పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణకు రూ.2516 కోట్లు నిధులు కేటాయించగా మన రాష్ట్రానికి రూ.300 కోట్లు నిధులు కేటాయించారు. గత ప్రభుత్వం హయాంలో ఈ ప్రక్రియ మొదలు పెట్టినప్పటికి సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఈ విధానం ముందుకు సాగలేదు. మన రాష్ట్రంలో ఇప్పుడిప్పుడే ఈ ప్రక్రియ జోరందుకుంది. జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ ఈ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించి రోజు వారీ రిపోర్టులను పరిశీలించి కింది స్థాయి ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్నారు. అయితే ఈప్రాజెక్టు రాష్ట్ర వ్యాప్తంగా అక్టోబరు 2వ తేదీ కల్లా పూర్తి చేసి కంప్యూటరీకరణ ప్రారంభించాలని ప్రయత్నాలు జరుగుతున్నప్పటికి కనీసం పైలట్ ప్రాజెక్టులుగా ప్రకటించిన 53 సంఘాల్లో (పీఏసీఎస్‌ల్లో)నైనా కంప్యూటరీకరణ ప్రారంభించాలన్నది ప్రభుత్వ లక్ష్యం.

5 దశల్లో ఆన్‌లైన్ ప్రక్రియ

ప్రస్తుతం సొసైటీల్లో ఐదు దశల్లో ఆన్‌లైన్ చేస్తున్నారు. వాటిలో సభ్యత్వ నమోదు, భూమి వివరాలు, అప్పు, డిపాజిట్‌లు, ఆదాయ వివరాలు నమోదు చేస్తున్నారు. కంప్యూటరీకరణ కోసం ప్రతి పీఏసీఎస్‌ల్లో కంప్యూటర్, ప్రింటర్, పాస్‌బుక్ ప్రింటర్, ఇన్వర్టర్, బ్యాటరీతో పాటు ఐదు వస్తువులు సమకూర్చుకునేందుకు ప్రభుత్వం రూ.3 లక్షలను కేటాయించింది.

కోనసీమలో రెండు సంఘాలు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 166 సంఘాలు (పీఏసీఎస్‌లు) ఉండగా ముందుగా వీరవల్లిపాలెం శ్రీరంగనాయిక లక్ష్మీనరసింహస్వామి సొసైటీ, అమలాపురం కేవీ రావు సొసైటీలను పైలట్ ప్రాజెక్టులుగా తీసుకున్నారు. ఈ సంఘాల్లో వచ్చే నెల 2వ తేదీ కల్లా సభ్యత్వ నమోదు, ఇతర వివరాల ఆన్‌లైన్ పనులు పూర్తి చేసుకుని కంప్యూటరీకరణ ప్రారంభించే విధంగా కార్యాచరణ జరుగుతుంది. ఇప్పటికే సంబంధిత సంఘాల్లో 90 శాతం వరకు వివరాలు నమోదు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు.

1,13,812 మంది వివరాలు ఆన్‌లైన్..

డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 166 సంఘాల్లో (పీఏసీఎస్‌ల్లో) 2,06,066 మంది సభ్యులు ఉండగా ఇప్పటి వరకు 1,13,812 మంది సభ్యుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. కంప్యూటరీకరణ వల్ల రైతులకు జాప్యం లేకుండా రుణాలు అందుతాయి. కాగిత రహిత వ్యవస్థ ఏర్పడి పీఏసీఎస్‌లకు ఖర్చు కూడా తగ్గుతుంది. ఈ నెల నాలుగో వారం నాటికి ఆన్‌లైన్ డేటా పనులు పూర్తి చేసుకుని అక్టోబరు-2వ తేదీ నాటికి పైలట్ ప్రాజెక్టు సంఘాల్లో కంప్యూటరీకరణ ప్రారంభిస్తాం.

ఏ.రమేష్, డీసీసీబీ ఏజీఎం

నేడు గురుపూజోత్సవం

● కలెక్టరేట్‌లో ఏర్పాట్లు ● డీఈవో కమలకుమారి

అమలాపురం టౌన్/ముమ్మిడివరం, సెప్టెంబరు 4: పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్‌లో గురుపూజోత్సవం-2024 నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి తెలిపారు. ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు పాల్గొని జిల్లాలోని ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తారని ఆమె చెప్పారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో జరిగే కార్యక్రమంలో జిల్లా నుంచి ఎంపిక చేసిన 42 మంది ఉత్తమ గురువులను సన్మానించనున్నట్టు తెలిపారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

కె.శ్రీనివాసరావు(ఐ.పోలవరం మండలం), కేజీ సత్యనారాయణ (అమలాపురం), డి.సత్తిరాజు (రాయవరం), కె.భ్రమరాంబికాదేవి (అంబాజీపేట), కె.శ్రీదేవిరత్నం (ఐ.పోలవరం), ఆర్.శేషగిరిరావు (పి.గన్నవరం), పీఎస్ఏ మంగాదేవి (కాట్రేనికోన), కేవీ నాగేశ్వరరావు (సఖినేటిపల్లి), బి.మధుసూదనరావు (అయినవిల్లి), కె.శకుంతల (రాజోలు), ఎం.రవికుమార్ (అమలాపురం), కేవీవీఎస్ఎన్ మూర్తి (మామిడికుదురు), బి.మల్లేశ్వరరావు (ఉప్పలగుప్తం), కె.వెంకటలక్ష్మి (ముమ్మిడివరం), సీహెచ్ రాజరాజేశ్వరి (అల్లవరం), కేఎస్ విజయలక్ష్మి (మలికిపురం), కేవీ సత్యనారాయణ (ఆత్రేయపురం), డి.భాగ్యలక్ష్మి (ఆలమూరు), ఎం.పైడిరాజు (రావులపాలెం), కె.ఆనందరావు (కొత్తపేట), బి.ఆదిలక్ష్మి (రామచంద్రపురం అర్బన్), ఎస్.శంకరరామం (కె.గంగవరం), ఎం.సత్యనారాయణ (రాయవరం), టి.లీలాకుమారి (కపిలేశ్వరపురం), కేవీఎస్ఎస్‌జేబీఎల్ రత్న (రామచంద్రపురంరూరల్), ఎస్.వేణుగోపాల్ (మండపేట), ఎం.బాలాజీ (అమలాపురం), కేవీఎస్ఎస్ఎం సుబ్బరాయశర్మ (అమలాపురం), వై.సంజీవయ్య (అమలాపురం), ఎంఎస్ మహాలక్ష్మి (అమలాపురం), ఎస్.రఘురామయ్య (మామిడికుదురు), ఎం.సత్యనారాయణ (సఖినేటిపల్లి), జి.నాగలక్ష్మి (మామిడికుదురు), టీఎల్ రెడ్డి (రావులపాలెం), ఎండీ అబ్దుల్‌ఖాన్ (ఆలమూరు), ఎస్.కృపానందం (పి.గన్నవరం), జి.సత్యనారాయణ (కొత్తపేట), వైవీవీఎస్ఎల్ సూర్యకుమారి (రామచంద్రపురం), బీపీ రామకృష్ణ (రాయవరం), కె.శ్రీనివాస్ (రాయవరం), పి.రామచంద్రారెడ్డి (మండపేట), పి.హరిఅప్పారావు (ముమ్మిడివరం మండలం) ఉన్నారు.

సర్వేపై అభ్యంతరాలుంటే తెలపాలి

అమలాపురం రూరల్, సెప్టెంబరు 4: కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైన్ ప్రస్తుత అలైన్‌మెంట్‌లో గ్రామాల వారీగా సర్వేచేసి ప్రజలు, ప్రభుత్వ శాఖల నుంచి ఉన్న అభ్యంతరాలను తెలపాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి సూచించారు. బుధవారం సాయంత్రం అలైన్‌మెంట్ సర్వే భూముల ప్రాంతంలో జాయింట్ కలెక్టర్ పర్యటించారు. భట్నవిల్లిలో భూముల యజమానులతో ఆమె మాట్లాడుతూ ప్రతిపాదిత రైల్వేలైన్ అలైన్‌మెంట్ మండల పరిధిలోని భట్నవిల్లి, కామనగరువు, రోళ్లపాలెం, పేరూరు, ఇమ్మిడివరప్పాడు మీదుగా వెళుతుందన్నారు. ఆయా గ్రామాల్లో అలైన్‌మెంటుకు అడ్డుగా రోడ్లు, కాల్వలు, విద్యుత్ స్తంభాలు, ఓఎన్జీసీ, గెయిల్ పైపులైన్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ట్యాంకులు, నివాస గృహాలను సర్వేచేసి ప్రజల నుంచి, ప్రభుత్వ శాఖల నుంచి అభ్యంతరాలను సంబంధిత ప్రొఫార్మాలో ఈ నెల 17వ తేదీలోగా సమర్పించాలని ఆమె ఆదేశించారు. జేసీ వెంట తహసీల్దార్ జీడీ కిశోర్‌బాబు పాల్గొన్నారు.

వెదురుపాకలో జ్వరంతో మహిళ మృతి 8

గౌతమి, గరీబ్‌రథ్ రైళ్లు రద్దు 7



గురువు... పోలీస్

- శ్రీకాకుళం జిల్లాలో టీచర్‌గా కెరీర్ ప్రారంభం
- ప్రస్తుతం 'తూర్పు గోదావరి జిల్లా ఎస్పీగా విధులు
- సమాజానికి మరింత సేవ చేయాలని సివిల్స్‌కి
- గురుపూజోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో నరసింహ కిషోర్ మాటామంతీ

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)



బ్లాక్ బోర్డు, చాక్‌పీస్‌తో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి తర్వాత పట్టుదలతో ఉన్నత స్థాయికి చేరిన వాళ్లు చాలా మంది ఉన్నారు. ఇంటర్వ్యూ వరకు వెళ్లి వెనక్కి వచ్చేశామని, కోచింగ్ లేదని ఇలా రకరకాల కారణాలకు తలొగ్గకుండా విజయం సాధించారు. పరిశ్రమ, లక్ష్య సాధనే వారిని అంతటి వారిని చేస్తోంది. అలా ఉపాధ్యాయుడిగా కెరీర్‌లో అడుగుపెట్టి నేడు తూర్పు గోదావరి జిల్లా పోలీసులకు బాస్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు దూసి నరసింహ కిషోర్. జిల్లాకు వచ్చిన కొద్ది రోజుల్లోనే అటు ప్రజల్లో... ఇటు సిబ్బందిలో మంచి పేరు సంపాదించుకున్న ఆయన గురువారం గురు పూజోత్సవం సందర్భంగా పలు విషయాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

ఆంధ్రజ్యోతి: మీ విద్యాభ్యాసం ఎక్కడ సాగింది?

ఎస్పీ: ఒకటి నుంచి ఏడో తరగతి వరకు ఒడిశా బోర్డరులోని మరం సరియాపల్లి అనే మారుమూల పాఠశాలలో జరిగింది. ఎస్ఎం పురంలో 10 వరకు చదివాను. డిగ్రీ శ్రీకాకుళంలో పూర్తి చేశాను.

అధ్యాపక వృత్తిని ఎంచుకోవడం?

1993లో డిగ్రీ పూర్తయింది. తర్వాత బీఎస్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, పీవో... ఇలా రకరకాల పోటీ పరీక్షలు రాశాను. ఏడుసార్లు ఇంటర్వ్యూ వరకూ వెళ్లినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో 1995లో బీఈడీ పూర్తిచేసి 1996లో ఉపాధ్యాయ పోటీ పరీక్షలో విజయం సాధించాను. శ్రీకాకుళం జిల్లా పాత కొంకాం అనే మారుమూల పల్లెలో తొలి పోస్టింగ్.

యూనిఫాం సర్వీసు వైపు రావడానికి కారణం?

మా నాన్న గారు ధర్మారావు టీచర్. ఆయనకు మంచి రచయితగా, పెద్ద మనిషిగా పేరుంది. మాది శ్రీకాకుళం అయినా రోజూ ఆయనతోనే స్కూలుకు వెళ్లి రావడం జరిగేది. పదో తరగతి వరకు అలా ట్రావెల్ చేశాను. సోషల్ వర్కర్ కూడా. చదువు, సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేసేవారు. ఆయన ప్రభావం నాపై ఎక్కువగా ఉండేది. దీంతో సివిల్స్‌కి వెళితే సమాజానికి మరింత మేలు చేయవచ్చనే ఆలోచన కలిగింది. మా ఇల్లే ఓ లైబ్రరీ. అందువల్ల వేరే కోచింగ్ తీసుకోలేదు. 2003లో గ్రూప్-1 రాశాను. 2006లో నర్సీపట్నంలో డీఎస్పీగా తొలి పోస్టింగ్. 2017లో నాన్-క్యాడర్ ఎస్పీ తర్వాత.. 2022లో ఐపీఎస్ వచ్చింది.

బోధనలో అప్పటికీ ఇప్పటికీ తేడా ఏమిటి?

విద్యార్థులు చాలా అప్‌డేట్ అయ్యారు. దానిని టీచర్లు అందుకోవాల్సిన అవసరం ఉంది. అప్పటి పిల్లలు టీచర్ చెప్పిందే లోకం అనుకునేవారు. కానీ మారిన పరిస్థితుల్లో ప్రశ్నించే స్థాయికి చేరుకున్నారు. దానిని మనం స్వాగతించాలి. వారితో స్నేహపూర్వకంగా మెలగాలి. ఇప్పటి పిల్లలపై సోషల్ మీడియా, సెల్‌ఫోన్ వంటి వాటి ప్రభావం ఎక్కువగా ఉంది. విద్యార్థికి కావాల్సింది క్లాస్‌రూంలో దొరకట్లేదని అనిపిస్తోంది. నైపుణ్యం అవసరమే అయినా సృజనాత్మకత వైపు విద్యార్థులను ప్రోత్సహించాలి.

విద్యార్థి వృద్ధిలో టీచర్, తల్లిదండ్రుల పాత్ర చెప్తారా?

విద్యార్థి నడవడిక (క్యారెక్టర్), పద్ధతి వంటివి ఇంటి నుంచే మొదలవ్వాలి. విద్యార్థి వద్ద పాఠశాలను, టీచర్లను చులకనగా మాట్లాడడం చేయకూడదు. విద్యార్థి ఎలాంటి సమస్యలనైనా తట్టుకునే విధంగా టీచర్ ధైర్యం నింపాలి. సృజనాత్మకతను వెలికితీసి పదునుపెట్టాలి. ప్రతి విద్యార్థిలోనూ ప్రత్యేకమైన ప్రతిభ ఉంటుంది. దానిని ఒడిసి పట్టుకుని సానబట్టాలి.

టీచర్ నుంచి దండన దూరం కావడం మంచిదేనా?

అప్పుడైనా ఇప్పుడైనా విద్యార్థులను కొట్టడం సరికాదు. వారి మనసులో ఒకటి ఉంటుంది. మనం ఒకటి చెబుతూ ఉంటాం. అక్కడే ఘర్షణ ప్రారంభమవుతుంది. పిల్లల తల్లిదండ్రులతో కూడా టీచర్లు మాట్లాడుతూ ఉండాలి. అప్పుడు ఈయన తప్పని పరిస్థితుల్లో ఒక దెబ్బ వేసినా తల్లిదండ్రులు అర్థం చేసుకుంటారు. టీచర్‌కి, విద్యార్థికి మధ్య శత్రుత్వం ఉండదు కదా. ఓ విద్యార్థికి, ఉపాధ్యాయుడికి ఉన్న బంధం ఎన్నటికీ కొనసాగుతూనే ఉంటుంది.

టీచర్లకు, సమాజానికి మీరిచ్చే సందేశం?

మానవ అవతారంలో ఉన్న దేవుడు రాముడికి జ్ఞానబోధ చేసిన అగస్త్యుడిని ఆది గురువుగా చెప్తుంటారు. తర్వాత శ్రీకృష్ణుడు జగద్గురువుగా వినుతికెక్కాడు. చెడు మార్గంవైపు వెళ్లకుండా జీవితాన్ని పసితనం నుంచే ఉన్నతం వైపు చేయిపట్టి నడిపించేవాడే గురువు. అలాంటి గురువుకి సమాజం తగిన గౌరవం ఇవ్వాలి. పిల్లాడి వృద్ధిపై తప్ప వేరే విధంగా వ్యక్తిగత కక్షలు టీచర్లకి ఎందుకుంటాయి?. ప్రతి విద్యార్థీ వృద్ధి చెంది, మంచి పేరు తెచ్చుకోవాలనే తాపత్రయం ప్రతి టీచర్‌లోనూ ఉంటుంది. దీనిని అర్థం చేసుకోవాలి. సమాజంలో అంతర్లీనంగా అతి ఎక్కువగా కలిసిపోయే ఉద్యోగం టీచర్, పోస్ట్‌మ్యాన్ మాత్రమే.

టీచర్, పోలీస్.. ఏది సంతృప్తినిచ్చింది?

టీచర్, పోలీస్.. రెండూ సమాజ సేవకు అంకితమయ్యేవే. దేనికదే ప్రాధాన్యం కలిగిన వృత్తి. ఇప్పటికీ నేను పని చేసిన స్కూల్స్‌కి వెళ్తుంటాను. ఆ ఊళ్లలో వారు మన మాస్టారు వచ్చారా.. అంటూ ఆప్యాయంగా పలకరిస్తారు. ఒకప్పటి నా విద్యార్థులు ఇప్పుడు ఇంజనీర్లుగా, డాక్టర్లుగా ఉన్నారు. పోలీస్‌గా కూడా ఎంతో మంది బాధితులకు న్యాయం చేశాను. ఇంకా చేయాల్సింది చాలా ఉంది. ఈ రోజు అయిపోయింది. రేపు కొత్తగా ఎలాంటి అహంభావాలు, భేషజాలు లేకుండా సమాజానికి మేలు చేస్తూ గడిచిపోవాలి.

థాంక్యూ... మళ్లీ కాసేపు పాత రోజులకు తీసుకెళ్లారు. మనసుకు ఏదో తెలియని హాయినిచ్చింది అంటూ ముగించారు



ఉపాధ్యాయ సహచరులతో ఆత్మీయ కలయికలో ఎస్పీ నరసింహ కిషోర్ (పాత చిత్రం)

గురువే దైవం

భగవంతుడు ఆగ్రహిస్తే గురువును ఆశ్రయించి అనుగ్రహాన్ని పొందవచ్చు. అదే గురువు ఆగ్రహిస్తే అనుగ్రహించే భగవంతుడే ఉండడని శాస్త్ర వచనం. అందుకే గురువు ఎక్కువా.. భగవంతుడు ఎక్కువా.. అనే మీమాంస వచ్చినప్పుడు గురువే ఎక్కువని చెప్తారు. ఎందుకో తెలుసా.. భగవంతుడిని చూడాలనే జ్ఞానాన్ని నేర్పించేది గురువే కనుక. గురువు అనుగ్రహం లేకుండా ఎవరూ జీవిత లక్ష్యాలను సాధించలేరు. తల్లి, తండ్రి, గురువు, అతిథి... ఈ నలుగురూ ప్రత్యక్ష గురువులు.

అమలాపురం రూరల్, సెప్టెంబరు 4: అక్షరానికి అంకురారోహణ చేసే తరగతి గది ఒక అద్భుత ప్రయోగ శాల. సమాజాన్ని నిర్మించడంలో, నైతిక విలువలు కాపాడడంలో ఉపాధ్యాయుడి పాత్ర కీలకం. ప్రపంచంలో నానాటికీ పెరిగిపోతున్న పోటీతత్వంవల్లో, ఆధునిక పోకడల గ్రహింపు కొరవడడంవల్లో, ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు పెరిగిపోవడంవల్లో గురువులు తమపై ఉన్న బాధ్యతను ఒకింత పక్కన పెట్టి విద్యార్థులను బట్టీ పట్టే మరమనుషులుగా తయారు చేస్తున్నారు. చదువులను యాంత్రిక ప్రక్రియగా మార్చేస్తున్నారు. పుస్తకాల్లోని పాఠాలు చెప్పడంతోనే ఉపాధ్యాయుల బాధ్యత తీరిపోదని గ్రహించాలి. సమాజం పట్ల బాధ్యత కలిగిన విద్యావంతులను ఆధునిక గురుబ్రహ్మలు తయారుచేయాలి. సామాజిక అవగాహన లేని చదువు ప్రయోజకత్వాన్ని చేకూర్చదు. విజ్ఞానంతో పాటు సమస్యల పరిష్కారం, సమాజం పట్ల బాధ్యత పెంచేలా చదువులు ఉండాలి. ఏ చదువైనా పిల్లలకు మానసికంగా ఎదగడం నేర్పాలి. చదివిన కొద్దీ జ్ఞానం పెరుగుతుంది. ఒకప్పటి గురుకులాలు నేటి సంక్షేమ వసతిగృహాలు వంటివే. గతంలో అన్ని వర్గాల పిల్లలకు ఒకే తరహా పాఠశాలల్లో నాణ్యమైన విద్యను గురువులు బోధించేవారు. పిల్లల బాగోగులను తల్లిదండ్రుల కన్నా గొప్పగా బడిలో ఉపాధ్యాయులే చూస్తారనడంలో ఎంతమాత్రం అతిశయోక్తి లేదు. నవసమాజ నిర్మాతలను తయారు చేయగల శక్తి ఉపాధ్యాయులకు మాత్రమే ఉంది. గురువును మించిన పూజనీయుడు, ఉద్ధారకుడు ఎక్కడా కనిపించడు. ప్రతి వ్యక్తికీ పూజనీయులుగా తల్లి, తండ్రి, గురువు, దైవం నిలుస్తారు. అయితే ఒక్క గురువులోనే ఈ నాలుగు అంశలు మనకు కనిపిస్తాయి. గురువు కన్నతల్లిలా లాలించి బుజ్జగిస్తాడు. కన్నతండ్రిలా మంచిచెడ్డలు గమనిస్తూ అభివృద్ధికి పాటుపడతాడు. దేవుడిలా ఆశీర్వదిస్తూ దిశానిర్దేశం చేస్తుంటాడు. శిష్యుడిలోని అజ్ఞానాంధకారాన్ని తొలగిస్తాడు. ఈ నాలుగు పాత్రలు పోషిస్తున్న గురువు ప్రతి వ్యక్తికీ నిజమైన ఆత్మబంధువు.



అమలాపురం రూరల్ పాలగుమ్మి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడు పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్ వాటర్ కలర్స్ ఉపయోగించి గీసిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రం

రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకోవడం మరువలేను

మోటూరి భైరవస్వామి
జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత



రాష్ట్రపతి నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకునే వారు కొందరే. అటువంటి వారిలో నాకూ చోటు లభించడం ఎన్నటికీ మర్చిపోలేను. 1985-86 సంవత్సరంలో అప్పటి రాష్ట్రపతి జ్ఞానీ జైల్‌సింగ్ నుంచి జాతీయ అవార్డు అందుకున్నాను. అంతకు ముందు వరుసగా మూడేళ్ల రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నాను. ఢిల్లీలో రాష్ట్రపతి భవన్‌లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులందరినీ ప్రత్యేక అతిథులుగా గుర్తించిన తీరు నేటికీ మరిచిపోను. రాష్ట్రపతి భవన్‌లో 132 గదులు ఉంటే మూడు మినహా అన్నిటినీ చూపించారు. రాష్ట్రపతితో కలిసి విందు భోజనం చేయడం ఎంతో అదృష్టం. ఆనాడు అసలు సిసలు సిల్వర్ మెడల్‌తో పాటు రూ.2,500 నగదు పారితోషికం, ప్రశంసాపత్రం అందించారు.

నైతిక విలువలు పెంపొందించాలి

కేకేవీ నాయుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు



అప్పటికీ, ఇప్పటికీ ఉపాధ్యాయుల విద్యా బోధనలో ఎన్నో మార్పులొచ్చాయి. ఆ రోజుల్లో నైతిక విలువలు బోధించేందుకు ప్రత్యేక పీరియడ్లు ఉండేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. నైతిక విలువలు పెంపొందించకపోవడం వల్లే సమాజంలో నేడు కనిపిస్తున్న అశాంతికి కారణమవుతోంది. తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించే సంప్రదాయం పాఠశాల తరగతి గదుల నుంచే ప్రారంభం కావాలి.

నిత్య విద్యార్థిగా మెలిగితేనే సత్ఫలితాలు

మంగళంపల్లి అరుణ్‌కుమార్, ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్



ఉపాధ్యాయులు ఎప్పటికీ నిత్య విద్యార్థులుగానే ఉండాలి. అప్పుడే విద్యోన్నతిలో భాగంగా ఎప్పటికప్పుడు మార్పులకు అనుగుణంగా విద్యా బోధన సాగించగలుగుతారు. తరగతి గదుల్లో పాఠ్యాంశాలకు మాత్రమే పరిమితం కాకుండా సమాజం పట్ల బాధ్యత, నిబద్ధత పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉంది. సమాజంలో గురువుల పట్ల గౌరవం ఏమాత్రం సడలలేదు.



వేలి గోటిపై 'సర్వేపల్లి' చిత్రం

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం నరసాపురపుపేట జడ్పీ ఉన్నత పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడు రాయుడు త్రినాథ్ ప్రసాద్ బొటన వేలి గోటిపై సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రం వేశాడు. ఒకటిన్నర సెంటిమీటర్లో మైక్రో ఆర్ట్ ద్వారా దీనిని తీర్చిదిద్దాడు. - ద్రాక్షారామ

సగ్గు బియ్యం, గోధుమలతో రాధాకృష్ణన్ చిత్రపటం

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని తూర్పు గోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన విద్యార్థి కుంచాల తపస్విరెడ్డి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాన్ని వినూత్నంగా రూపొందించాడు. అర కిలో సగ్గు బియ్యం, పావు కిలో గోధుమలతో మూడు గంటల పాటు శ్రమించి రాధాకృష్ణన్ చిత్రపటాన్ని తీర్చిదిద్దాడు. దీనిని తిలకించిన ఉపాధ్యాయులు, పట్టణ ప్రముఖులు తపస్విరెడ్డిని అభినందించారు.

- నిడదవోలు





వరద బాధితులకు రూ.కోటి విరాళం

కృష్ణా జిల్లా వరద బాధితులకు ఆపన్నహస్తం అందించేందుకు ముందుకొచ్చారు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిదకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, బీఎస్ఆర్ ఇన్‌ఫ్రా అధినేత బలుసు శ్రీనివాసరావు. బుధవారం ఆయన అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని కలిసి రూ.కోటి విరాళం చెక్కు అందజేశారు.

- మండపేట



ప్రత్యేక అలంకరణలో శ్రీపాదశ్రీవల్లభుడు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతి

శ్రీపాద శ్రీవల్లభులకు సహస్ర లిల్లీ పుష్ప పూజ

పిఠాపురం, సెప్టెంబరు 4: కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో జరుగుతున్న శ్రీపాద జయంతి సప్తాహ మహోత్సవాలు బుధవారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. శ్రీపాద శ్రీవల్లభులకు సహస్ర లిల్లీ పుష్పాల పూజ నిర్వహించారు. శ్రీపాద శ్రీవల్లభుని పాదపద్మములకు మహన్యాసపూర్వక శతరుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుషసూక్తాలతో సహస్ర నామార్చన, రుత్విక్కులతో మూల మంత్ర అనుష్ఠానం జరిగాయి. సాయంత్రం పల్లకి సేవ జరిగింది. కార్యనిర్వహణాధికారి సౌజన్య, భక్తులు పాల్గొన్నారు.

ధర్మవరం వద్ద మోటారు సైకిళ్లు ఢీ

క్షతగాత్రులను ప్రొటోకాల్ వాహనంలో ఆసుపత్రికి తరలించిన కలెక్టర్ షన్ మోహన్

చికిత్స పొందుతూ ఆర్ఎంపీ వైద్యుడి మృతి, మరో వ్యక్తికి తీవ్ర గాయాలు







1. ముసలారావును కలెక్టర్ కారులో తరలిస్తున్న దృశ్యం 2. ప్రత్తిపాడు ఆసుపత్రిలోకి తీసుకెళ్తూ 3. విగతజీవిగా...

ప్రత్తిపాడు, సెప్టెంబరు 4: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం వినాయకుని గుడి కూడలి వద్ద బుధవారం రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న ఘటనలో ఆర్ఎంపీ వైద్యుడు మృతి చెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను కలెక్టర్ షన్ మోహన్ తన ప్రొటోకాల్ కారులో ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించారు. గొల్లప్రోలు మండలం చెందుర్తికి చెందిన ఆర్ఎంపీ సిద్ధాంతపు ముసలారావు సలారావు (52) మోటారు సైకిలుపై ప్రత్తిపాడు మండలం ధర్మవరం బయల్దేరి వెళ్లాడు. అదే గ్రామం నుంచి గొల్లప్రోలుకు చెందిన పొన్నాడ హరిగంగాధర్ స్నేహితుడు బాబీతో కలిసి రాజానగరం బయల్దేరాడు. ముందుగా వన్నెపూడి నుంచి ధర్మవరం వైపు వస్తున్న ముసలారావు ధర్మవరం వినాయకుడి గుడి కూడలి వద్ద మలుపు తిరుగుతుండగా వెనుక నుంచి వేగంగా వస్తున్న హరిగంగాధర్, బాబి మోటారు సైకిలు ఢీకొంది.



ముసలారావు (పాత చిత్రం)

ముసలారావు, హరిగంగాధర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో ఏలేశ్వరంలో ఏలేరు రిజర్వాయరును పరిశీలించి కాకినాడ వెళ్తున్న కలెక్టర్ షన్ మోహన్ తన ప్రొటోకాల్ వాహనాన్ని ఆపి అందులో క్షతగాత్రులద్దరినీ ఎక్కించి ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ముసలారావు మృతి చెందాడు. ఆర్ఎంపీ కుటుంబీకులు ఆసుపత్రి వద్ద కన్నీరుమున్నీరయ్యారు. తమ కుటుంబానికి దిక్కెవరు అంటూ ముసలారావు ముగ్గురు కుమార్తెల రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి. ప్రత్తిపాడు తహసీల్దారు సూర్యప్రభ ఆసుపత్రికి వచ్చి మృతుడి కుమార్తెలను పరామర్శించి ఓదార్చారు. సంఘటనాస్థలాన్ని సీఐ బి.సూర్యఅప్పారావు, ఎస్ఐ ఎం.పవన్‌కుమార్ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



రాజమండ్రి : శ్యామల
రాజమండ్రి : మిని సూర్య
కాకినాడ : అనంద్‌సినిమాస్
కాకినాడ : దేవి సినిమాస్
అమలాపురం : శేఖర్
పిఠాపురం : సత్య
మండపేట : విజయమహల్



సంఘటనా స్థలంలో నవీన్ మృతదేహం

ఆగి ఉన్న లారీని ఢీకొని యువకుడి మృతి

గండేపల్లి, సెప్టెంబరు 4: కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలో జెడ్.రాగంపేట గ్రామ శివారులోని పెట్రోలు బంకు ఎదురుగా రాజమహేంద్రవరం నుంచి తుని వైపు వెళ్లే మార్గం ట్యాంకరు ఆగి ఉంది. వెనుక నుంచి బైక్‌పై వెళ్తున్న కరణం నవీన్ అలియాస్ సిద్దు (22) బలంగా ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. సిద్దు సొంతూరు అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కరణం కొత్తూరు. బుధవారం అతడు విజయవాడ నుంచి స్వగ్రామానికి వెళ్లే క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. విషయం తెలుసుకున్న హైవే మొబైల్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ శివనాగబాబు వచ్చారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

గౌతమి, గరీబ్‌రథ్ రైళ్లు రద్దు



రాయనపాడు వద్ద ముంపులో ట్రాక్

సామర్లకోట, సెప్టెంబరు 4: భారీ వర్షాల కారణంగా సామర్లకోట మీదుగా విశాఖ, విజయవాడలకు రాకపోకలు సాగించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు మూడో రోజైన బుధవారం కూడా రద్దయ్యాయి. ఈ కారణంగా ప్రయాణికులు లేక సామర్లకోట రైల్వే స్టేషన్ నిర్మానుష్యంగా మారింది. బుధవారం రద్దయిన వాటిలో కాకినాడ నుంచి లింగంపల్లి వెళ్లే గౌతమి ఎక్స్‌ప్రెస్, గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్, హౌరా నుంచి చెన్నై వెళ్లే ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-విశాఖ మధ్య నడిచే 2740 నంబరు గల ఎక్స్‌ప్రెస్, విశాఖ-సికింద్రాబాద్ మధ్య నడిచే 12739 నంబరు గల ఎక్స్‌ప్రెస్ ఉన్నాయి.

హైదరాబాద్-విశాఖ (12728), మహబూబ్‌నగర్-విశాఖ (12862), ఎల్టీటీ-విశాఖ (18520)... ఈ మూడింటినీ పగిడిపల్లి, గుంటూరు, విజయవాడ మీదుగా మళ్లించినట్టు సామర్లకోట రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ ఎం.రమేష్ తెలిపారు. విజయవాడ సమీపాన రాయనపాడు వద్ద రైల్వే ట్రాక్ బుధవారం సాయంత్రానికి కూడా నీటి ముంపులో ఉన్నందున ఈ మార్పులు కొనసాగిస్తున్నట్టు రైల్వే అధికారులు చెప్పారు.

రాజమండ్రి	సాయి కృష్ణ 2K AC DTS	సీతానగరం	గీతా బాలాజీ AC DTS
రాజమండ్రి	శివ జ్యోతి 2K AC DTS	అనపర్తి	సత్యగౌరీ AC DTS
రాజమండ్రి	రాజా 4K AC DTS	గోకవరం	TD సినిమేక్స్ 2K AC DTS
కాకినాడ	తిరుమల 2K AC DTS	ముమ్మిడివరం	వెంకటేశ్వర AC DTS
కాకినాడ	లక్ష్మి 2K AC DTS	కిర్లంపూడి	సూర్యరాము-1 2K AC DTS
కాకినాడ	ఆనంద్ కాంప్లెక్స్ 4K AC DTS	కాకరపల్లి	శ్రీలక్ష్మి AC DTS
అమలాపురం	వెంకటరమణ 2K AC DTS	చింతూరు	నవయుగ DTS
మండపేట	సత్య శ్రీ 2K AC DTS	రంపచోడవరం	లలిత 2K AC DTS
వాకలపూడి	సూర్య సినీ మాక్స్ 1 2K AC DTS	రాయవరం	రాయల్ టాకీస్ 4K AC DOLBY ATMOS
ధవళేశ్వరం	మురళీకృష్ణ 4K AC DOLBY ATMOS	అన్నవరం	NVR మల్టీప్లెక్స్-1 2K AC DOLBY ATMOS
కడియం	వెంకట సూర్య 2K AC DTS		
నామవరం	VS మహల్ 4K AC DOLBY ATMOS		
రాజానగరం	ఫార్చ్యూన్ 4 సినిమాస్ 2K AC DTS		
రావులపాలెం	అక్షర కాంప్లెక్స్ 2K AC DOLBY ATMOS		
కొత్తపేట	సత్య చంద్ర 2K AC DTS		
తాటిపాక	వెంకటేశ్వర AC DTS		
మల్కిపురం	శ్రీ శంకర్ 2K AC DOLBY ATMOS		
లక్కవరం	వేణుగోపాల్ 1 2K AC DTS		
రామచంద్రపురం	సూర్య సినీ మాక్స్-1 2K AC DTS		
ద్రాక్షారామం	సూర్య సినిమాక్స్ AC DTS		
యానం	పద్మ 2K AC DTS		
రాజోలు	4షోస్ సినీప్లెక్స్ AC DTS		
సామర్లకోట	విఘ్నేశ్వర 2K AC DTS		
అంగర	వెంకట మాణిక్యాంబ AC DTS		
పెద్దాపురం	లలిత 2K AC DTS		
జగ్గంపేట	నాగేశ్వర 2K AC DTS		
పిఠాపురం	పూర్ణ 2K AC DTS		
కత్తిపూడి	శ్రీ సత్యనారాయణ 2K AC DOLBY ATMOS		
గొల్లప్రోలు	గోవింద మహల్ AC DTS		
ఉప్పాడ	ఓం శ్రీనివాస AC DTS		
ఏలేశ్వరం	వెంకట సూర్య AC DTS		
జి.మామిడాడ	శ్రీనివాస AC DTS		



విశ్వహిందూ పరిషత్ సమావేశం

మలికిపురం, సెప్టెంబరు 4: బుధవారం లక్కవరం ఎంజీ గార్డెన్స్‌లో విశ్వహిందూ పరిషత్ సమావేశం జరిగింది. విశ్వహిందూ పరిషత్ స్థాపించి 60ఏళ్లు పూర్తయిన సందర్భంగా జరిగిన సమావేశంలో వక్తలు హిందుత్వం గురించి వివరించారు. సమావేశంలో విశ్వహిందూపరిషత్ రాష్ట్ర సత్సంగ్ ప్రముఖ్ రాళ్లపల్లి పాపయ్యశర్మ, అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, ప్రయోగ నరసింహమూర్తి, గుబ్బల ప్రసాద్, పలచోళ్ల రాంబాబు, అడబాల నరసింహారావు, మంగెన నాని, బోనం సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న గోదావరి.. లంకల్లో పడవ ప్రయాణం



అంతర్వేది: అంతర్వేది దేవస్థానం పంచాయతీ చుట్టూ ముంపునీరు, కె.గంగవరం: కోటిపల్లి వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న అధికారులు

పి.గన్నవరం, సెప్టెంబరు 4: భారీ వర్షాలకు గోదావరి ఎగువన వరద ఉధృతి పెరగడంతో ధవళేశ్వరం బ్యారేజీ వద్దకు భారీగా వరద వచ్చి చేరుతుంది. దీంతో బ్యారేజీ నుంచి దిగువకు సముద్రంలోకి వరద నీటిని విడుదల చేయడంతో కోనసీమ జిల్లాలోని నదీపాయలు నిండుగా ప్రవహిస్తున్నాయి. రెండు రోజులు క్రితం పెరిగిన వరద ఉధృతికి ఉభయ గోదావరి జిల్లాల సరిహద్దు ప్రాంతం చాకలిపాలెం వద్ద కనకాయలంక కాజ్‌వేపైకి వరదనీరు చేరి అనంతరం తగ్గింది. ప్రస్తుతం మళ్లీ వరద ఉధృతి పెరుగుతుండటంతో కాజ్‌వేపైకి నీరు చేరనుంది. గంటిపెదపూడి శివారు పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక, ఉడిమూడి శివారు ఉడిమూడిలంక గ్రామస్థులు బూరుగులంక నదీపాయ వద్ద పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లా అనగార్లంక, పెదమల్లంక తదితర గ్రామాల ప్రజలు పడవలపైనే ప్రయాణం సాగిస్తున్నారు. వరద ఉధృతి పెరగడంతో మండల, గ్రామస్థాయి అధికారులను కలెక్టర్ అప్రమత్తం చేశారు. రామచంద్రపురం ఆర్డీవో ఎస్.సుధాసాగర్, తహశీల్దార్ పి.శ్రీపల్లవి, ఎంపీడీవో ఎం.భారతీలు బూరుగులంక నదీపాయ, మానేపల్లి శివారు శివాయిలంక, పల్లిపాలెం వరద ముంపు ప్రాంతాలను పరిశీలించి స్థానిక గ్రామస్థాయి సిబ్బందికి సూచనలు చేశారు. మండలంలోని 12లంక గ్రామాలకు వీఆర్వో, పంచాయతీ కార్యదర్శులను టీమ్స్‌గా ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ శ్రీపల్లవి తెలిపారు. విద్యుత్‌శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను అప్రమత్తం చేసి ముఖ్యమైన నదీపాయలు వద్ద 24గంటలు అందుబాటులో ఉండే విధంగా ప్రత్యేక టీమ్స్ ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు.

నీట మునిగిన పంటలు

కొత్తపేట, సెప్టెంబరు 4: ఎడతెరిపిలేని వర్షంతో మండలంలో పంటలు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ముఖ్యంగా పల్లపు ప్రాంతాలన్నీ మునిగిపోయాయి. టి.సావరం, శీలంవారిపాలెం, వరి పంట పొలాలు జలదిగ్బంధంలో ఉండటంతో ముంపు నీటిని మళ్లించేందుకు కౌశిక డ్రైయిన్ అనుకూలంగా లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. స్కూల్స్‌కు సెలవు ప్రకటించినప్పటికీ పాఠశాల ప్రాంగణాలు వర్షం నీటితో నిండిపోయాయి.

ముంపు ప్రాంతాల పరిశీలన

అయినవిల్లి, సెప్టెంబరు 4: భారీ వర్షాలు, గోదావరి పొంగి ప్రవహిస్తుండడంతో వీరవల్లిపాలెంలో ముంపు బారిన పడ్డ ప్రాంతాలను అమలాపురం డివిజనల్ పంచాయతీ అధికారి పి.బొజ్జిరాజు బుధవారం పరిశీలించారు. వరద ముంపు రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై స్థానిక అధికారులకు సూచనలు చేశారు. ఆయన వెంట పంచాయతీ విస్తరణాధికారి వాణిశ్రీ, పంచాయతీ కార్యదర్శి గరిమెళ్ల రవి, రామచంద్రరావు, సూర్యనారాయణమూర్తి, దారా రామకృష్ణ ఉన్నారు.

కుండపోత వర్షం

మలికిపురం, సెప్టెంబరు 4: రెండు రోజుల నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ముంపు నీరు దిగక ఎక్కడికక్కడ వర్షం నీరు ఎగదన్నింది. రోడ్లపై నీరు ప్రవహిస్తుంది. చాలా గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. తూర్పుపాలెం, గూడపల్లి, చింతలమోరి తదితర ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. గుడిమెళ్లంక, లక్కవరం తదితర ప్రాంతాల్లో ఊడ్చిన సార్వా పంట నీటిలో కుళ్లిపోతుంది. జనజీవనం స్తంభించింది. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సూచనలతో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు స్థానిక రెవెన్యూ యంత్రాంగంతో ముంపునీరు పోయే ఏర్పాట్లను చూస్తున్నారు.

వరదలు, వర్షాలపై అధికారులు అప్రమత్తం

ఆత్రేయపురం, సెప్టెంబరు4: వరదలు, వర్షాల ప్రభావంతో అధికార యంత్రాగం అప్రమత్తమైంది. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో నాతి బుజ్జి అధ్యక్షతన మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. అధికార యంత్రాంగమంతా అప్రమత్తమై గ్రామాల్లో ఉండాలని సూచించారు. డిప్యూటీ తహశీల్దారు ఇస్మాయిల్, ఈవోపీర్డీ శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి శ్రీధర్, ట్రాన్స్‌కోఏఈ బాలరాజు, ఏవో భార్గవమహేష్, వైద్యాధికారి సౌమ్య, అధికారులు పాల్గొన్నారు.

డ్రైన్లలో పూడిక తొలగింపు...

వర్షాలకు డ్రైన్లలో పేరుకుపోయిన తూడు, మట్టిని తొలగించారు. పేరవరం, వద్దిపర్రు, వాడపల్లి, లొల్ల గ్రామాల్లో అధికారుల బృందం పర్యటించింది. జేసీబీల సాయంతో చెత్తను డ్రైయిన్ల నుంచి తొలగించారు. అంకంపాలెంలో వర్షం తెరుపు ఇచ్చిన తర్వాత బ్లీచింగ్ చల్లారు. గోదావరి పరివాహక ప్రాంతానికి ఆనుకున్న గ్రామాల్లో రైతులను అప్రమత్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కాయల జగన్నాథం, ముత్యాబత్తుల రాజు, జుజ్జవరపు శ్యామలహరిబాబు, నరాలశెట్టి సుబ్బలక్ష్మి తదితరులు శానిటేషన్ చర్యలు పరిశీలించారు.

కోటిపల్లి వద్ద వరద ఉధృతి

కె.గంగవరం, సెప్టెంబరు 4: మండలంలో బుధవారం ఉదయం నుంచి భారీ వర్షం కురిసింది. జనజీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచిపోయింది. గోదావరికి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో కోటిపల్లి వద్ద గోదావరి ఉధృతి పెరిగింది. ఎంపీడీవో ఎస్.శ్రీనివాసరావు, తహశీల్దార్ కె.సూర్యారావు, ఆర్‌ఐ వెంకట్రావు, గ్రామ కార్యదర్శి శ్రీరామచంద్రమూర్తి కోటిపల్లిలోవరద ఉధృతిని పరిశీలించారు.

రోడ్లు జలమయం

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 4: మండలంలోని బుధవారం కురిసిన భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. కుండపోతగా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. భారీ వర్షంతో పల్లపు ప్రాంతాలకు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ కనీసం బయటకు వెళ్లే అవకాశం లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. వర్షానికి రోడ్లపైకి నీరు చేరడంతో చెరువులను తలపించాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలుచోట్ల గృహాల్లోకి నీరు చేరింది. వరి చేలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే అప్పులు చేసి పెట్టుబడులు పెట్టామని వర్షాలకు వరి చేలు నీట మునగడంతో అవి పనికి రాకుండా పోతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. భారీ వర్షానికి నీట మునిగిన ప్రాంతాలను ఎంపీడీవో కొండలరావు, స్థానిక కార్యదర్శి శివచక్రవర్తి, గ్రామసర్పంచ్ సాకా శ్రీనివాస్ పరిశీలించి పారిశుధ్య కార్మికులతో వర్షం నీరు త్వరితగతిన బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టారు.

ఎడతెరిపిలేని వర్షాలు

అంతర్వేది, సెప్టెంబరు 4: సఖినేటిపల్లి మండలంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పల్లపు ప్రాంతాలు, కాలనీలు, రోడ్లు జలమయమయ్యాయి. అంతర్వేదిపల్లిపాలెం, దేవస్థానం, అంతర్వేది, కేశవదాసుపాలెం, గొంది, శృంగవరప్పాడు గ్రామాల్లో వర్షం నీరు చేరి స్థానికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. పాఠశాలల ఆవరణలు ముంపు నీటితో నిండి ఉన్నాయి. అంతర్వేది దేవస్థానం ప్రధాన రహదారి మోకాలు లోతునీరు చేరడంతో గుడికి వెళ్లే భక్తులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయిన్లు సక్రమంగా లేకపోవడంతో కాల్వలు, పంటబోదెలు పొంగి పొర్లుతున్నాయి.

పల్లపు ప్రాంతాలు నీట మునక

ముమ్మిడివరం, సెప్టెంబరు 4: వాయుగుండం కారణంగా కురుస్తున్న వర్షాలకు మండలంలో పలు ప్రాంతాలు నీట మునిగాయి. బుధవారం ఉదయం ఒక్కసారిగా కురిసిన భారీ వర్షానికి పలు కాలనీలు, రోడ్లు నీట మునిగాయి. మండలంలో 45.2 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదైంది. వర్షాలతో పంట కాల్వలు, మురుగునీటి కాల్వలు పొంగి ప్రవహిస్తున్నాయి. కాలనీల్లో అంతర్గత రోడ్లు నీట మునిగాయి. తహశీల్దార్ కార్యాలయం, సబ్‌ట్రెజరీ కార్యాలయం, పోలీసుస్టేషన్ ఆవరణ, పోలీసు క్వార్టర్స్ ఆవరణలు నీట మునిగాయి. తహశీల్దార్ కార్యాలయం, పోలీసుస్టేషన్, సబ్‌ట్రెజరీ కార్యాలయాల్లోకి వర్షం నీరు ప్రవేశించింది. మురుగునీటి కాల్వల వెంబడి ఉన్న వరి పొలాలు నీట మునుగుతున్నాయి. భారీ వర్షాలతో రోడ్లన్నీ ఛిద్రంగా మారాయి. ఆసుపత్రులకు వెళ్లే రోడ్డు, ప్రభుత్వ బాలికల, బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ, జీఎంసీ బాలయోగి కాలనీలు నీటమునిగాయి.

నీట మునిగిన కాలనీలు

అంబాజీపేట, సెప్టెంబరు4: కురుస్తున్నవర్షాలకు గ్రామాల్లో కాలనీలు పూర్తిగా నీటమునిగాయి. రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. పంట చేలల్లో ముంపునీరు దిగక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అంబాజీపేట బస్టాండ్ ప్రాంగణమంతా వర్షం నీటితో నిండిపోయింది. పుల్లేటికుర్రులో పలు కాలనీల్లో ముంపు నీరు భారీగా చేరడంతో సర్పంచ్ జల్లి బాలరాజు ఆధ్వర్యంలో ముంపు నీరు మళ్లించేందుకు చర్యలు చేపట్టారు. వరదలు, వర్షాలకు విషసర్పాలు ఇళ్లలోకి చేరుతున్నాయి. నందంపూడిలో గోసంగి సత్యనారాయణ ఇంటి వద్ద బుధవారం అర్ధరాత్రి త్రాచు పాము రావడంతో స్నేక్‌క్యాచర్ వర్మ పట్టుకుని బంధించారు. చప్పిడివారిపాలెం ఓఎన్‌జీసీ రోడ్డులో భారీ వృక్షం నెలకొరిగింది. విద్యుత్‌శాఖ ఏఈ కె.మోహన్ ఆధ్వర్యంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

- జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి
- వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన
- ముంపు బారినపడే పంట పొలాల పరిశీలన

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


లంక గ్రామాల్లో పర్యటిస్తున్న జేసీ నిషాంతి

ముమ్మిడివరం, సెప్టెంబరు 4: గోదావరి వరదలను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగమంతా సంసిద్ధంగా ఉందని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పేర్కొన్నారు. మండలంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో బుధవారం ఆమె పర్యటించారు. గౌతమీ గోదావరి ఏటిగట్టును పరిశీలించి గురజాపులంకలో ముంపు బారినపడే పంటపొలాలను పరిశీలించారు. అధికార యంత్రాంగం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కూనాలంకలో వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించి వారికి సూచనలిచ్చారు. లంకాఫ్‌ఠాణేలంకలో గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. గ్రామ సర్పంచ్ కొప్పిశెట్టి కృష్ణమూర్తితో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో పారిశుధ్యం సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గురజాపులంక, కూనాలంక, లంకాఫ్‌ఠాణేలంక గ్రామాల్లో ఉన్న రైతులు పశువుల పాలు తీయడం, కూరగాయలు తెచ్చుకోవడం వంటి పనులకు రాకపోకలు సాగించాల్సి ఉన్నందున వరద పెరుగుతున్న నేపథ్యంలో మూడు మెకనైజ్ పడవలు ఏర్పాటు చేయాల్సిందిగా రైతులు కోరగా అవసరమైన మెకనైజ్ బోట్లను ఏర్పాటు చేయాలని మత్స్యకారులను ఆదేశించారు. మండల ప్రత్యేకాధికారి మధుసూదన్, రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు జేసీ వెంట ఉన్నారు.

వరద ప్రాంతాల పరిశీలన

అంబాజీపేట, సెప్టెంబరు4: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు జె.వెంకటేశ్వరి, ఎంపీడీవో జీవీ సరోవర్ సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. నదీతీర ప్రాంతాల్లో గోదావరి వరద వచ్చే అవకాశాలున్న నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. తొండవరం, వాకలగరువు, నందంపూడి గ్రామాల్లో వరద ప్రభావిత ప్రాంతాలను తహశీల్దారు వెంకటేశ్వరి, డిప్యూటీ తహశీల్దారు నాగపద్మలక్ష్మి పరిశీలించారు. వైద్యాధికారులు గౌతమి, ఇంద్రావతి, ఎంఈవో కె.వెంకటేశ్వరరావు, ఏవో సీహెచ్‌డీ విజయకుమార్, ఏపీవో అడపా వెంకటకృష్ణ, హౌసింగ్ అధికారి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వరద ఉధృతిపై సమీక్ష

అంతర్వేది, సెప్టెంబరు 4: సఖినేటిపల్లి ఎంపీడీవో కార్యాలయంలో అధిక వర్షాలు, వరద ఉధృతిపై మండల అధికారులు సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. ఎంపీడీవో సత్యనారాయణ, డిప్యూటీ తహశీల్దార్ భాస్కర్ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో ముంపు ప్రాంతాల వివరాలు, వరద ఉధృతిపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఏపీవో నాగప్రసాద్, ఎంఈవోలు కిశోర్‌కుమార్, వెంకటేశ్వరరావు, ఏవో నరసింహారావు, అధికారులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

మామిడికుదురు, సెప్టెంబరు 4: గోదావరికి క్రమేణా వరద తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అమలాపురం ఆర్డీఈవో కేశవర్ధనరెడ్డి సూచించారు. బుధవారం ఆయన ఆదుర్రు, గోగన్నమఠం గ్రామాల్లో వైనతేయ నదీ తీరంలోని ఏటిగట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఆదుర్రులోని శిథిలస్థితికి చేరిన అవుట్‌ఫాల్ స్లూయిస్‌ను పరిశీలించి అక్కడ చేయాల్సిన ఏర్పాట్ల గురించి అధికారులతో చర్చించారు. బలహీనంగా ఉన్న ఏటిగట్ల వద్ద ఇసుక బస్తాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలిచ్చారు. తహసీల్దార్ మృత్యుంజయరావు, డ్రెయిన్స్ అధికారులు పాల్గొన్నారు.

ద్వారపూడిలో విగ్రహాల ఏర్పాటులో వివాదం


రెండు వర్గాల మధ్య ఉద్రిక్తత పరిస్థితి దృశ్యం

ఇరువర్గాలతో ఆర్డీవో, డీఎస్పీ చర్చలు విఫలం

మండపేట,సెప్టెంబరు4: ద్వారపూడిలో అంబేడ్కర్, రంగా విగ్రహాల ఏర్పాటు విషయంలో రెండు సామాజిక వర్గాల మధ్య ఏర్పడిన వివాదం కొనసాగుతోంది. మంగళవారం ద్వారపూడిలో ఫ్లైఓవర్ వంతెన సమీపంలో వున్న నాలుగు రోడ్ల జంక్షన్‌లో ఇద్దరు నేతల విగ్రహాలను పోటాపోటీగా ఏర్పాటు చేసేందుకు ఇరువర్గాలు మంగళవారం రాత్రి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. తిరిగి రెండు వర్గాల మధ్య చోటుచేసుకున్న వివాదం నేపథ్యంలో గ్రామంలో పోలీసు పికెట్ కొనసాగుతుంది. బుధవారం విగ్రహాల ఏర్పాటు విషయంపై మరోసారి పోలీసు బందోబస్తు ఉన్నప్పటికి ఇరు వర్గాలకు చెందిన వారు పోటాపోటీగా విగ్రహాలు ఏర్పాటు చేసే వివాదాస్పద స్థలానికి చేరుకోవడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బుధవారం రాత్రి ద్వారపూడిలో పరిస్థితిని సమీక్షించి ఇరువర్గాల మధ్య చర్చలు జరిపేందుకు రామచంద్రపురం ఆర్డీవో సుధాసాగర్, డీఎస్పీ రామకృష్ణ చేరుకున్నారు. ఇరువర్గాలతో స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద చర్చలు జరిపేందుకు చేసిన ప్రయత్నం ఫలించ లేదు. ఇరువర్గాలు భారీగా పంచాయతీ వద్ద విగ్రహ స్థలం వద్ద మోహరించడంతో ఉద్రిక్త పరిస్థితులు నడుమ చర్చలు జరగలేదు. ఇరువర్గాలను పోలీసులు చెదరగొట్టారు. గ్రామంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను ఆర్డీవో కలెక్టర్‌కు వివరించారు. ఇరువర్గాలతో త్వరలో రామచంద్రపురం ఆర్డీవో కార్యాలయంలో చర్చలు జరుపుతామని ఆర్డీవో తెలిపారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 4: విద్యార్థులు విద్యతో పాటు నైపుణ్యాలు పెంచుకోవాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. బుధవారం వికాస ఆధ్వర్యంలో డీఎస్సీ కెమిస్ట్రీ చదివిన విద్యార్థులకు స్థానిక వీఎస్ఎం కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. 3కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 16 మంది ఉద్యోగాలు పొందారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మేడిశెట్టి శేషారావు తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I THATAVARTHI LAKSHMI SINDHU W/o Naga Veera Venkata Satyanarayana Murthy, Resident of Door No.8-2-34, Machiraju Street, AmalapuramTown & Mandal, Dr. B.R.Ambedkar Konaseema Dist. AP-533201, I Hence by declare that my Name has been Changed From TATAVARTHI LAKSHMI SINDHU (Old Name) to THATAVARTHI LAKSHMI SINDHU (New Name). Hence all my documents and Correspondence will continue With my New Name of THATAVARTHI LAKSHMI SINDHU for all practical purposes.

బొట్టు బిళ్లలతో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రం




మలికిపురం, సెప్టెంబరు 4: గూడపల్లి-గుబ్బలపాలెం వసంత కాలనీకి చెందిన సెవెంత్‌డే స్కూల్ ఒకటవ తరగతి విద్యార్థి బి.స్టాలిన్ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రాన్ని విభిన్నంగా చిత్రించాడు. చార్టుపై స్కెచ్‌తో గీసిన ఆకారంలో రంగురంగుల బొట్టు బిళ్లలను అతికిస్తూ అందమైన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రాన్ని చిత్రించాడు. స్టాలిన్ తండ్రి బట్టేలంక జిల్లాపరిషత్ హైస్కూలులో డ్రాయింగ్ టీచరుగా పనిచేస్తున్నారు.

మైనంతో సర్వేపల్లి బొమ్మ



ద్రాక్షారామ, సెప్టెంబరు4: హసన్‌బాద జడ్పీ ఉన్నత పాఠశాల చిత్రలేఖనఉపాధ్యాయుడు జి.శ్రీను టీచర్స్‌డేను పురస్కరించుకుని మైనంతో సర్వేపల్లి రాధాకృష్ణన్ బొమ్మను రూపుదిద్దాడు.

ఆకట్టుకున్న రాధాకృష్ణన్ చిత్రం



రాయవరం, సెప్టెంబరు4: ఉపాధ్యాయదినోత్సవాన్ని పురస్కరించుకుని వెదురుపాకకు చెందినతెలుగు ఉపాధ్యాయుడు చిర్రా వెంకట మోహన్ గీసిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రం ఆకట్టుకుంది. వివిధ రకాల రంగులతో రాధాకృష్ణన్ చిత్రాన్ని గీశారు.

భర్త, అత్తమామలపై కేసు నమోదు

ఆత్రేయపురం, సెప్టెంబరు 4: వరకట్న వేధింపులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ర్యాలి గ్రామానికి చెందిన తాటికొండ శేషసత్యధనలక్ష్మీజ్యోతికి అమూజురుకు చెందిన తాటికొండ సత్యవెంకట తాతారావుతో 2003లో వివాహమైంది. వారికి సంతానం కలగలేదు. కొంత కాలం నుంచి భర్త తాతారావు, అత్త, ఆడపడుచు అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేయడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిన ఎంపీటీసీ

కపిలేశ్వరపురం, సెప్టెంబరు4: కాలేరు ఎంపీటీసీ టేకి శ్రీసత్యమంజు, టేకి ఏసురాజు బుధవారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. మండపేట టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు ముత్యాల సత్యనారాయణ, వల్లూరి కాశీవిశ్వనాథం, గుణ్ణం సత్యనారాయణ, మెర్ల తాతాజీ, చుండ్రు రామకృష్ణచౌదరి, మత్తాల మధుసూదనరావు, దాయం శేఖర్‌బాబు, పలివెల రమేష్, అల్లూరి రామకృష్ణచౌదరి, వల్లూరి వీరబాబు, సాకా శ్రీనివాస్, కుంచె ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

సత్యనారాయణ సేవలు ప్రశంసనీయం

కె.గంగవరం, సెప్టెంబరు4: పదవీ విరమణ చేసిన శివల మెయిన్ పాఠశాల ఉపాధ్యాయుడు సాగి సత్యనారాయణ వర్మ సేవలు ప్రశంసనీయమని వక్తలు అన్నారు. బుధవారం శివలలో సత్యనారాయణ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు, జడ్పీటీసీ ఓలేటి శ్రీవరలక్ష్మి రాజ్‌కుమార్, సర్పంచ్ అనసూరి సాయిబాబు, ఎంపీటీసీ వాసంశెట్టి నాగమణి, ఎంఈవో-1 ఏ.నాగరాజు, ఎంఈవో-2 చోడిశెట్టి ఆంజనేయులు, యూటీఎఫ్ నాయకులు దానరి శ్రీనివాస్, పెంకే వెంకటేశ్వరరావు, మాగాపు ప్రదీప్‌కుమార్, కేశవరావు, పి.గుణవంతుడు, ఇన్‌చార్జి హెచ్ఎం డి.లోవరాజు, మేడిశెట్టి పుల్లయ్య, కూటమి నాయకులు నిడదవోలు సుబ్రహ్మణ్యం, బలుసు శివప్రసాద్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి


రాయవరం, సెప్టెంబరు 4: పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని టీడీపీ సీనియర్ నేత ఉండవిల్లి రాంబాబు పిలుపునిచ్చారు. బుధవారం రాయవరం గ్రామ పంచాయతీ వద్ద వ్యాపారులతో సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి, వార్డు మెంబరు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: మిస్టర్ బచ్చన్
శ్రీలలిత	: కమిటీ కుర్రోళ్లు
శేఖర్ స్క్రీన్-1	: మారుతీనగర్ సుబ్రహ్మణ్యం
శేఖర్ స్క్రీన్-2	: డబుల్ ఇస్మార్ట్
రమా	: ఆయ్
గణపతి	: రేవు
వెంకటపద్మావతిస్క్రీన్-1	: సరిపోదా శనివారం
వెంకటపద్మావతి స్క్రీన్-2	: తంగలాన్

వరద బాధితులకు రూ.3లక్షల ఆహార పదార్థాలు



రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 4: విజయవాడ వరద బాధితులకు కె.గంగవరం మండలం సత్యవాడకు చెందిన తోట వెంకన్న రూ.3లక్షలు విలువైన ఆహార పదార్థాలను మంత్రి సుభాష్‌కు అందజేశారు. బుధవారం రాత్రి పట్టణంలో టీడీపీ కార్యాలయం వద్ద ఐదువేల బిస్కెట్లు ప్యాకెట్లు, ఆరు వేల ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐదు వేల ఎనర్జీడ్రింక్స్, ఐదు వేల రొట్టెలు లోడ్ చేసిన వ్యాన్‌ను మంత్రి సుభాష్‌కు అందజేశారు. మంత్రి సుభాష్ వెంటనే వాటిని విజయవాడకు తరలించారు.

వరద బాధితులకు బిస్కెట్లు, వాటర్ బాటిళ్లు



రావులపాలెం, సెప్టెంబరు 4: విజయవాడ ముంపు ప్రభావిత ప్రాంతాల్లోని బాధితులకు బిస్కెట్లు, వాటర్ బాటిళ్లు తరలించారు. రాష్ట్ర సెర్ప్ సీఈవో సూచనల మేరకు జిల్లా స్వయం సహాయక సంఘాల మహిళలు, సమాఖ్య ఆధ్వర్యంలో రూ.2లక్షలు విలువైన 20వేల బిస్కెట్లు ప్యాకెట్లు, 20వేల వాటర్ బాటిల్స్ పంపించినట్టు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పీడీ డాక్టర్ పి.శివశంకరప్రసాద్ తెలిపారు. రావులపాలెం నుంచి వాహనంలో లోడు చేసి విజయవాడ పంపినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షురాలు జి.సుమలత, సెక్రటరీ రాజేశ్వరి, స్త్రీనిధి డైరక్టర్ వెంకటలక్ష్మి, అన్నపూర్ణ, ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

బీవీసీ విద్యా సంస్థలు రూ.5లక్షల విరాళం



అమలాపురం రూరల్, సెప్టెంబరు 4: ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు మేరకు విజయవాడ వరద బాధితులకు తమ వంతుగా బీవీసీ విద్యా సంస్థల తరపున రూ.5లక్షలు విరాళం అందిస్తున్నట్టు విద్యాసంస్థల అధినేత బోనం కనకయ్య తెలిపారు.

వరద బాధితులకు రూ.10వేలు విరాళం

కె.గంగవరం, సెప్టెంబరు 4: యూటీఎఫ్ నాయకుడు, కూళ్ల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు చిట్టూరి రామ్మోహన్‌రావు వరద బాధితుల కోసం రూ.10వేలు అందజేశారని ఎంపీడీవో ఎన్.శ్రీనివాస్, తహశీల్దార్ కె.సూర్యారావు తెలిపారు.

వరద సహాయక చర్యల్లో టీడీపీ నేతలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 4:విజయవాడలో వరద సహాయక చర్యల్లో రామచంద్రపురం టీడీపీ నాయకులు, కార్యకర్తలు చురుగ్గా పాల్గొంటున్నారు. తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్‌రాయ్‌ను మూడు డివిజన్లకు సహాయ కమిటీలో సభ్యుడిగా నియమించారు. పార్టీ మండల అధ్యక్షుడు పితానివీరభద్రరావు, నురుకుర్తి శ్రీనివాస్, కె.సత్యనారాయణ, సూరిబాబు, మధు, అప్పారావు, రాజులు రిష్వంత్‌రాయ్ బృందంతో కలిసి సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు.

258 మంది ముంపు బాధిత రైతులు

ఉప్పలగుప్తం, సెప్టెంబరు4: మండలంలో సార్వా నాట్లు వేసిన రైతుల్లో 258మంది తీవ్రంగా నష్టపోయారని వ్యవసాయాధికారి జి.కుమార్‌బాబు ప్రత్యేక అధికారికి వివరించారు. బుధవారం ప్రత్యేకాధికారి ఎ.మధుసూదన్ పొలాలను పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో వివిధశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. వర్షపాత హెచ్చరికల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. రైతుల సూచన మేరకు డ్రెయిన్లలో చేపల వలకట్లు లేకుండా చూడాలని సూచించారు. తాగునీరు, పారిశుధ్యంపై సమీక్షించారు.తహశీల్దార్ వాసా దివాకర్, ఎంపీడీవో కొరారి వెంకటేశ్వరప్రసాద్ పాల్గొన్నారు.

8వ ప్రవక్త ఇమామ్‌కు ఘన నివాళి

మామిడికుదురు, సెప్టెంబరు 4: ముస్లింల ఆరాధ్య దైవం, ఎనిమిదో ప్రవక్త హజరత్ ఇమామ్‌రజాకు ముస్లింలు బుధవారం ఘన నివాళులర్పించారు. మామిడికుదురులోని ఇమామ్ రజా పంజాలో జరిగిన షహదత్, మజ్లిస్‌లో మత ప్రబోధకుడు అలీ హైదర్‌అబేది మజ్లిస్ ఆలపించారు. షహదత్‌ను ప్రతీ సంవత్సరం సఫర్ మాసంలోని 29వ తేదీన షహదత్‌చేసి మజ్లిస్ నిర్వహిస్తారు. పంజా ధర్మకర్త సర్కిల్ పకార్‌సాహెబ్ ఆధ్వర్యంలో ఈకార్యక్రమాలు జరిగాయి. పంజా నుంచి గుమ్మటాన్ని తీసి మాతం నిర్వహిస్తూ నగరం పెదపంజీష వరకు ఊరేగింపు చేశారు. గుర్తేమొహిబ్బానే భక్త బృందం ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిగింది. కార్యక్రమంలో స్థానిక భక్తులతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

కూలిన పెంకుటిల్లు: తప్పిన ప్రాణాపాయం

ద్రాక్షారామ, సెప్టెంబరు 4: రామచంద్రపురం మండలం చిన్నతాళ్లపొలంలో కురిసిన వర్షాలకు మట్టిగోడలతో నిర్మించిన రెండు గదుల పెంకుటిల్లు బుధవారం కూలిపోయింది. ఇంటిలో గన్నెమ్మ మంగళవారం రాత్రి నిద్రపోయింది. బుధవారం తెల్లవారుతుండగా ఒక గది గోడకు బీటలు తీయడంతో స్థానికులు అప్రమత్తమై గన్నెమ్మను సమీపంలో బంధువుల ఇంట్లోకి చేర్చారు. కొద్ది సేపటికి ఆ ఇల్లు మొత్తం కూలిపోయింది. దీనిపై వీఆర్వో నరేష్ తహశీల్దార్‌కు నివేదిక అందించారు.

కంప్యూటర్ బహూకరణ

అంతర్వేది, సెప్టెంబరు 4: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు రామేశ్వరానికి చెందిన బళ్ల చంద్రశేఖర్ ఒక కంప్యూటర్‌ను బహూకరించారు. దాతకు చిత్రపటాన్ని, ప్రసాదం ఆలయ అధికారులు అందించారు.

వెంకన్న ఆలయంలో భక్తజనం

ఆత్రేయపురం, సెప్టెంబరు 4: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,48,622 లభించింది. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి తాడేపల్లిగూడానికి చెందిన వెలగ కిశోర్- ప్రజిత దంపతులు రూ.51,116 విరాళం సమర్పించారు. దాతలకు ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ స్వామివారి చిత్రపటాన్ని అందించారు.


వరద బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం

కొత్తపేట, సెప్టెంబరు 4: ఏపీలో వరద బాధితులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన చర్యలు అభినందనీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం అన్నారు. కొత్తపేటలో బుధవారం ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులు బాధితులకు సాయం చేయడం మాని విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. సీఎం చంద్రబాబు 24గంటలు క్షేత్రస్థాయిలో బాధితుల పరిస్థితులను గమనించి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారని, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఎప్పటికప్పుడు అలర్ట్ చేస్తూ ఆదుకున్నారన్నారు.

నిత్యాన్నదానానికి రూ.10,116 విరాళం

మామిడికుదురు, సెప్టెంబరు 4: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన యల్లమిల్లి వంశీమోహన్-కిరణ్మయి దంపతులు రూ.10,116 విరాళం అందించారు. భక్తులకు అధికారులు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి అభినందించారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు మల్లేశ్వరరావు



ఉప్పలగుప్తం, సెప్టెంబరు4: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఉప్పలగుప్తం పంచాయతీ పెద్దూరు ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బండారు మల్లేశ్వరరావు ఎంపికైనట్లు ఎంఈవో కార్యాలయం ప్రకటించింది. మల్లేశ్వరరావు 22ఏళ్లుగా ఎస్‌జీటీగా సేవలందిస్తున్నారు. ఆయనను ఎంపీపీ దంగేటి వీరఅచ్యుతజానకీరాంబాబు, జడ్పీటీసీ గెడ్డం సంపదరావు, సర్పంచ్ కడిమి చిన్నవరాజు, ఎంపీటీసీ తాళ్ల లలితారవి, ఎంఈవోలు కె.కిరణ్‌బాబు, సత్తి సత్యకృష్ణ, ఎస్టీయూ జిల్లా వాణి కన్వీనర్ చిక్కం మైనర్‌బాబు, ఎస్టీయూ అధ్యక్షుడు వై.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎన్.రుషేంద్రకుమార్, ఆర్థిక కార్యదర్శి డి.బాలకృష్ణ, రాష్ట్ర కోకన్వీనర్ వాసంశెట్టి వెంకటేశ్వరరావు, నాయకులు జీవీ కృష్ణారావు, వై.బాస్కరశాస్త్రి, కె.రంజిత్‌కుమార్, యూటీఎఫ్ నాయకులు గుత్తుల సుబ్రహ్మణ్యం, ఎ.సురేష్‌కుమార్ అభినందించారు.

పవిత్ర వారసత్వాన్ని పరిరక్షించాలి

అమలాపురం టౌన్, సెప్టెంబరు 4: రోళ్లపాలెంలోని పవిత్రమైన శ్రీఅమలేశ్వర స్వామి ఆలయ విశిష్టతతో పాటు పుష్కర వారసత్వాన్ని పరిరక్షించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ జిల్లాశాఖ అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో బుధవారం అమలాపురం ఆర్డీవో కార్యాలయంలో పరిపాలనాధికారికి అర్జీ అందించారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన అమలేశ్వరస్వామి ఆలయాన్ని పరిరక్షించాలన్నారు. కోనసీమ రైల్వేలైన్ ఎలైన్‌మెంట్ కొనసాగితే పుష్కర ప్రాధాన్యత, అమలేశ్వరస్వామి ఆలయ విశిష్టత దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం అందించిన వారిలో సర్పంచ్ పొణకల గణేష్, ఆదిరెడ్డి సాయి, ఉగ్రింక రమేష్, గొవ్వాల నాగరాజు, శివాజీ, నరసింహమూర్తి, నూలు శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల పూజలు

అంతర్వేది, సెప్టెంబరు 4: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు బుధవారం విచ్చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు మహదాశీర్వచనం చేశారు. స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదం ఏసీ వి.సత్యనారాయణ అందించారు.

జ్వరంతో వివాహిత మృతి

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన



రాయవరం, సెప్టెంబరు 4: జ్వరంతో బాధపడుతూ వివాహిత మృతి చెందిన సంఘటన వెదురుపాకలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతురాలి సోదరుడు రామిశెట్టి చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.... వెదురుపాకకు చెందిన సలాది సంతోషిమాత (28) అనే వివాహిత జ్వరం, వాంతులు, విరేచనాలతో బాధపడుతోంది. ఆమెకు కుటుంబ సభ్యులు ఒక ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేయించారు. జ్వరం తగ్గకపోవడంతో పాటు రక్తకణాల సంఖ్య పడిపోవడంతో మెరుగైన చికిత్స కోసం రాజమహేంద్రవరం తరలిస్తుండగా పరిస్థితి విషమించి మార్గమధ్యంలో మృతి చెందింది. డెంగీ అనుమానిత లక్షణాలతో మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. మృతిరాలికి భర్త దుర్గారావు, 2వ తరగతి చదువుతున్న కుమారుడు సూర్యతేజ ఉన్నారు.

